సాక్షి రంగారెడ్డి

మంగళవారం ¦ 24 ¦ జనవరి ¦ 2023



గూడు కోసం పోరుబాట

గూడు కోసం పేదలు పోరుబాట పట్టారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రారంభించిన పోరాటం సోమవారం కొనసాగింది. 8లో▸



బదిలీలు హర్షణీయం

ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టడం హర్షణీయమని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్ అన్నారు. 8లో▸

భాగస్వామ్య ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ వేదికగా సోమవారం రియల్టర్ ఆక్సిజన్, మలేషియన్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ బిజినెస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ కోర్సుల అభివృద్ధి కోసం భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి. కార్యక్రమంలో సినీ నటుడు మురళీ మోహన్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, రియల్టర్ ఆక్సిజన్ సీఈఓ నంది రామేశ్వరరావు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సమస్యలను నేరుగా విన్నవించేందుకే 'ప్రజావాణి'



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరిస్తామని అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు వారి సమస్యలపై నేరుగా ఫిర్యాదు చేసేందుకే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చిన ఫిర్యాదులను శాఖలవారీగా పంపించి పరిష్కరించేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఫిర్యాదుదారులు పాల్గొన్నారు.

కంటివెలుగు శిబిరాల తనిఖీ



చిలుకూరులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు

మొయినాబాద్: అంధత్వ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని జిల్లా వైద్యాధికారి బి.వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంతోపాటు మండలంలోని చిలుకూరు పంచాయతీ ఆవరణలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు చేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, మెడికల్ అధికారి వాణి, చిలుకూరు సర్పంచ్ స్వరూప, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

షాబాద్: కంటి వెలుగు క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని చందనవెల్లిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు క్యాంపును సోమవారం పర్యవేక్షించారు. అనంతరం చందనవెల్లిలో కన్సర్న్ ఇండియా ఫౌండేషన్ ద్వారా నిర్మిస్తున్న ఆస్పత్రి నూతన భవనాన్ని పరిశీలించారు. చందనవెల్లి ఆస్పత్రిలో సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, సీహెచ్‌ఓ గోపాల్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

రామ జన్మభూమి మందిర్ 3డీ ఫ్రేమ్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: చారిత్రక ఆధ్యాత్మిక విశేషాలను చిత్రాలుగా అందించే నగరానికి చెందిన గిఫ్ట్స్ తయారీ కంపెనీ సువా (ఎస్‌యూఏ) గిఫ్ట్స్ రామ జన్మభూమి మందిర్ 3డీ ఫ్రేమ్‌ను రూపొందించింది. దీనిని సోమవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. కొంతకాలంగా పలు ఆలయాలు, ఆధ్యాత్మిక విశేషాలను అపురూపమైన ఫ్రేమ్స్‌గా మలచడంలో పేరొందిన తాము అదే క్రమంలో రామ జన్మభూమి మందిర్‌ను కూడా రూపొందించామని ఈ సందర్భంగా సువా గిఫ్ట్స్ డైరెక్టర్ సిద్ధార్థ్ జైన్ తెలిపారు.



ఇటీవల కందుకూరు మండలం గుమ్మడవెల్లిలో బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం



మీర్‌పేటలో కాంగ్రెస్ నేతల పర్యటన (ఫైల్)

నియోజకవర్గాల్లో మకాం
గెలుపే లక్ష్యం..

ఆత్మీయ సమ్మేళనాలు.. పాదయాత్రలు

- ముందస్తు ఊహాగానాలతో ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు
- శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాలతో బీఆర్ఎస్ నేతలు బిజీబిజీ
- ప్రజా సమస్యలే ఎజెండాగా కాంగ్రెస్, బీజేపీ ఆందోళనలు
- ఎవరికివారుగా పావులు కదుపుతున్న రాజకీయ నాయకులు



మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ పరిధిలో సోమవారం నిర్వహించిన చేవెళ్ల అసెంబ్లీ విస్తృతస్థాయి సమావేశంలో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి, ఇతర బీజేపీ నేతలు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా రాజకీయ పార్టీలు పావులు కదుపుతున్నాయి. బడ్జెట్ సమావేశాల తర్వాత ప్రభుత్వాన్ని రద్దు చేసి ముందస్తుకు వెళ్లే అవకాశం ఉందన్న ఊహాగానాల నేపథ్యంలో బీఆర్ఎస్ జిల్లా నేతలు అప్రమత్తమయ్యారు. నిన్న మొన్నటి వరకు ప్రజలు, పార్టీ కార్యకర్తలకు కొంత దూరంగా ఉన్న వారు సైతం కొద్ది రోజులుగా వారి మధ్యే ఉంటున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.. ప్రారంభోత్సవాల పేరుతో నిత్యం ఏదో ఒక విధంగా హడావుడి చేస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో నియోజకవర్గాల వారీగా ముఖ్య నేతలతో సమావేశాలు నిర్వహించి సంస్థాగత అంశాలపై చర్చిస్తున్నారు. అంతర్గతంగా పార్టీ పరిస్థితి.. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చడంపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరుతున్నాయా.. ప్రభుత్వం నుంచి ఇంకేం ఆశిస్తున్నారు వంటి అంశాలపై ఆరా తీస్తున్నారు.

ఒక్కోనేత ఒక్కో పేరుతో..

మహేశ్వరం నియోజకవర్గంలో ఇటీవల మంత్రి సబితారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నేతలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో మంత్రి తనయుడు కార్తీక్‌రెడ్డి కీలకంగా వ్యవహరించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కీలక అంశాలపై చర్చించారు. తాజాగా ఇబ్రహీపట్నం నియోజకవర్గంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రగతి నివేదన పేరుతో పాదయాత్రకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కూడా ఈనెల 29 నుంచి శుభోదయం పేరుతో నియోజకవర్గంలోని అర్బన్ ప్రాంతాల్లో పర్యటించేందుకు ప్లాన్ చేస్తున్నారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య సహా పలువురు ముఖ్య నేతలు వారివారి నియోజకవర్గాలు విడిచి బయటికి రావడం లేదు. సీఎంఆర్‌ఎఫ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ, కంటి వెలుగు కార్యక్రమాలు, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలతో బిజీగా మారారు. ఇప్పటి వరకు తమపై ఉన్న అసంతృప్తితో ఉన్న కేడర్‌ను స్వయంగా కలిసి బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. కార్యకర్తల ఇళ్లలో జరిగే శుభ కార్యక్రమాలు, ఏదైనా జరిగితే పరామర్శలకు హాజరవుతున్నారు.

కాంగ్రెస్, బీజేపీ సైతం..

మరోవైపు బీఆర్ఎస్ పార్టీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష కాంగ్రెస్, బీజేపీ నేతలు కూడా అలెర్ట్ అయ్యారు. అధికారపార్టీ భూ కబ్జాలు, కాంట్రాక్టులు, రియల్ ఎస్టేట్ పేరుతో కొల్లగొట్టిన అసైన్డ్, ప్రభుత్వ భూములు, కార్యకర్తల ఆగడాలు, ప్రజలపై మోపిన పన్నుల భారాలను వారికి వివరించే పనిలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. ఇప్పటికే మీర్‌పేట మున్సిపాలిటీలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఇంటింటికీ తిరిగి ఆయా అంశాలను వివరించే ప్రయత్నం చేయగా, ఇతర నేతలు స్థానిక సమస్యలే ఎజెండాగా ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఇక బీజేపీ వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలని ప్రయత్నాలు మొదలుపెట్టింది. కేంద్ర మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, పార్టీ కీలక నేతలు ఎప్పటికప్పుడు స్థానిక కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. బూత్ స్థాయిలో కేడర్‌ను మరింత బలోపేతం చేసేందుకు యత్నిస్తున్నారు. మొత్తంగా అన్ని పార్టీల నేతల హడావుడితో పొలిటికల్ హీట్ పెరిగింది.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- సహజ యోగా రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి

కొడంగల్ రూరల్: ప్రతిరోజూ యోగా సాధన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని సహజ యోగా రాష్ట్ర కో ఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం యోగా శిక్షణా శిబిరాలను నిర్వహించారు. పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో నిర్వహించిన యోగా శిక్షణ శిబిరంలో పలువురు వక్తలు మాట్లాడుతూ.. భారతదేశ విద్యా విధానంలో యోగాకు ప్రత్యేక స్థానం కల్పించారని తెపారు. 1970లో యోగా సిద్ధాంతాన్ని ప్రారంభించారని చెప్పారు. ప్రపంచంలోని 70దేశాల్లో యోగా అమలవుతోందన్నారు. యోగాతో శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుందని వివరించారు. బీపీ, షుగర్, వెన్నెముక, మెడ, కండరాల నొప్పులు, అజీర్ణం, మలబద్దకం తదితర ఎన్నో వ్యాధుల నుంచి శరీరం త్వరగా కోలుకునేందుకు యోగా దోహదపడుతుందన్నారు. అనంతరం సహజ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆర్.జగదీశ్వర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, ఎంఈఓ రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు రాజు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అడగకుండానే ఇంటి జాగా..

- మంత్రి సబితారెడ్డి
- ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు పట్టాల పంపిణీ

కందుకూరు: ఫార్మాసిటీకి భూములు ఇచ్చిన రైతులకు అడగకుండానే వారి త్యాగం, కష్టాన్ని గుర్తించి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ పెద్ద మనస్సుతో పరిహారానికి అదనంగా ఇంటి జాగా అందిస్తున్నారని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి కొనియాడారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట, బేగరికంచెలకు చెందిన ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన 325 మంది రైతులకు సోమవారం ఇళ్ల స్థలాలకు సంబంధించి సర్టిఫికెట్లను జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫార్మాకు సేకరించిన భూమిలో 600 ఎకరాల్లో లేఅవుట్ అభివృద్ధి చేసి భూమి కోల్పోయిన ప్రతి రైతుకు ఎకరాకు 121 గజాల స్థలం అందించనున్నట్లు తెలిపారు. గుంట భూమి కోల్పోయిన రైతులకు సైతం 60 గజాల చొప్పున స్థలాన్ని ఇస్తున్నామన్నారు. భూములు ఇచ్చిన ప్రతి రైతుకు ఎలాంటి నష్టం జరగకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్లాట్లను ఎవరూ అమ్ముకోవద్దని ఇది ముఖ్యమంత్రి ఇచ్చిన బహుమతిగా భావించాలన్నారు. గతంలో పవర్‌గ్రిడ్‌లో భూములు కోల్పోయిన రైతులకు ప్లాట్లు ఇస్తామని చెప్పారు. లేఅవుట్ పూర్తయిన తర్వాత డ్రా తీసి లబ్ధిదారులకు కేటాయిస్తామన్నారు. ఫార్మాసిటీతో పాటు అమేజాన్, మెడికల్ కళాశాల, ఫార్మా యూనివర్సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. యువతకు శిక్షణ ఇచ్చి స్థానికంగా ఏర్పాటయ్యే కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాలతో రైతులు లబ్ధిపొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూరజ్‌కుమార్, ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, స్థానిక సర్పంచులు జ్యోతి, సరళమ్మ, ఎంపీటీసీ కాకి రాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, తహసీల్దార్ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు చిర్ర సాయిలు, మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, ఇందిర, సర్పంచులు రామచంద్రారెడ్డి, కలమ్మ, మంద సాయిలు, నరేందర్, భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ సురేష్, డైరెక్టర్లు ఎస్.శేఖర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సీనియర్ నాయకులు గండు నర్సింహ, కాకి రవి, ఇ.సత్తయ్య, డి.నర్సింహ, కాకి నర్సింహ, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, నందీశ్వర్, కృష్ణారెడ్డి, ఆనంద్, సామయ్య తదితరులు పాల్గొన్నారు.



మీర్‌ఖాన్‌పేటలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న మంత్రి, జెడ్పీచైర్‌పర్సన్ తదితరులు

తెలంగాణలో అవినీతి పాలన

- రాష్ట్రాన్ని దోచుకుంటున్నారు
- రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారు
- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి

మొయినాబాద్ రూరల్: తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తున్నారని.. ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోతోందని పార్లమెంటరీ వ్యవహారాలు, బొగ్గు, గనుల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. హిమాయత్‌నగర్ చౌరస్తాలోని కంజర్ల మాల్‌లో సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన చేవెళ్ల లోక్‌సభ విస్తృతస్థాయి సమావేశానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో అందినంత దోచుకుంటున్న కేసీఆర్ ప్రభుత్వం బీఆర్ఎస్ పేరుతో దేశాన్ని ముంచేందుకు వెళ్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను తామే చేస్తున్నామని గొప్పలు చెప్పడం హాస్యాస్పదం అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలే కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. బీజేపీ నాయకులు గ్రామస్థాయి నుంచి కష్టపడి పనిచేయాలని, అప్పుడే ఫలితం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, శ్రీరాములుయాదవ్, అంజన్‌కుమార్‌గౌడ్, ప్రేమ్‌రాజ్‌యాదవ్, ప్రతాప్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సనివెల్లి ప్రభాకర్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నక్కలపల్లి జంగారెడ్డి, మోర నర్సింహారెడ్డి, శ్రీధర్, సామ రంగారెడ్డి, చేవెళ్ల లోక్‌సభ ఇన్‌చార్జి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్ సమీపంలో పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చేవెళ్ల అసెంబ్లీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

పురసారథులకు 'పరీక్ష'

- ఎల్లుండితో ముగియనున్న మూడేళ్ల పదవీ కాలం
- మున్సిపల్ చట్టంలో మూడేళ్ల తర్వాతే అవిశ్వాసం
- నాలుగేళ్లకు సవరిస్తూ బిల్లు చేసిన ప్రభుత్వం
- గవర్నర్ తమిళిసై వద్ద పెండింగ్‌లో ఫైల్
- అవిశ్వాస తీర్మానాలకు పావులు కదుపుతున్న అసమ్మతులు
- నగర శివారులోని మెజారిటీ పురపాలికల్లో ఇదే పరిస్థితి



సాక్షి, రంగారెడ్డిజిల్లా/ మేడ్చల్‌జిల్లా: నగర/పురపాలికల్లో క్యాంపు రాజకీయాలకు తెరలేస్తోంది. మూడేళ్ల పదవీకాలం ముగియనుండటంతో అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టే దిశగా పావులు కదులుతున్నాయి. ఇందుకు వ్యూహరచన చేస్తుండటంతో ప్రస్తుత పాలక వర్గాలు పదవిని కాపాడుకునేందుకు.. వైరి వర్గం కుర్చీ దక్కించుకునేందుకు ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నాయి. నగర, పురపాలక సంఘాల్లో అవిశ్వాస పరీక్షలకు మూడేళ్ల కాల పరిమితిని విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పురపాలక చట్టంలో పొందుపర్చింది. దీన్ని నాలుగేళ్లకు సవరిస్తూ గత ఏడాది అసెంబ్లీలో బిల్లును ఆమోదించింది. గవర్నర్ తమిళిసై పరిశీలనకు వెళ్లిన ఈ బిల్లుకు ఇప్పటికీ మోక్షం లభించలేదు. దీంతో పాత చట్టమే మనుగడలో ఉందని భావిస్తున్న అసంతృప్తి నేతలు, అవిశ్వాస తీర్మానాలను ప్రవేశపెట్టేందుకు పావులు కదుపుతున్నారు. నగర/పురపాలక సంఘాలు పగ్గాలు చేపట్టి ఈ నెల 26 నాటికి మూడేళ్లు ముగుస్తున్నందున ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని పురపాలికలపై కన్నేసిన ఆశావహులు ఎత్తులు వేస్తున్నారు. గడువు సమీపిస్తుండటంతో కొంతకాలంగా విందు, విహార యాత్రలతో బిజీగా ఉన్న ఈ నేతలు మరిన్ని వ్యూహాలు రచిస్తున్నారు. నగర శివారులోని దాదాపు మెజారిటీ మున్సిపాలిటీల్లో అవిశ్వాస పరీక్షలు పెట్టే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

మేడ్చల్ జిల్లాలో..

- మేడ్చల్ జిల్లాలో నిజాంపేట్, బోడుప్పల్, జవహర్‌నగర్, పీర్జాదిగూడ, మున్సిపల్ కార్పొరేషన్లలో అధికార పార్టీ సభ్యులే వైరి వర్గాలుగా విడిపోయారు. ప్రస్తుత పాలక వర్గాలకు మూడేళ్లు పూర్తి కావడంతో పీఠం దక్కించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఇప్పటికే నిజాంపేట్ కార్పొరేటర్లు ఇటీవల శ్రీశైలం వేదికగా, జవహర్‌నగర్ నగరపాలక సంస్థ పాలక సభ్యులు ఉభయ గోదావరి జిల్లాలు వేదికగా క్యాంపు రాజకీయాలు నెరిపారు.
- బోడుప్పల్ కార్పొరేషన్‌లోనూ గ్రూపు రాజకీయాలు అధికమయ్యాయి. ఇక్కడ కూడా అవిశ్వాస పరీక్షకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. మేడ్చల్ మున్సిపాలిటీలో కొంత కాలంగా మున్సిపల్ చైర్‌పర్సన్ తీరుపై అధికార పార్టీ కౌన్సిలర్లు గుర్రుగా ఉన్నారు. ఇదే విషయమై మంత్రి సమక్షంలో పలుమార్లు అసంతృప్తి వెళ్లబుచ్చారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోనూ అధికార పార్టీలోని ఇరు వర్గాలు నువ్వా నేనా అన్నట్లుగా అవిశ్వాసానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. నాగారం మున్సిపాలిటీలో చైర్మన్‌పై అవిశ్వాసానికి అంతర్గంగా పావులు కదుపుతున్నట్లు అధికార టీఆర్ఎస్ కౌన్సిలర్లలోనే చర్చ జరుగుతోంది. దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దుండిగల్, కొంపెల్లి మున్సిపాలిటీల్లోని అధికార పార్టీలో అంతర్గత విభేదాలు భగ్గుమంటున్నాయి.

రంగారెడ్డి జిల్లాలో..

- ఆదిబట్ల, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట, మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల్లో అవిశ్వాస పరీక్షలు పెట్టేందుకు అసంతృప్తి నేతలు పావులు కదుపుతున్నారు. గతంలో పదవీ కాలం ఒప్పందాలు కుదుర్చుకున్న సభ్యులు కూడా పట్టు వీడకపోవడంతో కొన్ని చోట్ల విశ్వాస పరీక్షలకు దారితీస్తోంది. ఇంకొన్ని చోట్ల పదవీ నుంచి దిగేందుకు ససేమిరా అనడం కూడా ఈ పరిస్థితులకు కారణంగా మారుతోంది.
- తుర్కయంజాల్‌లో మెజార్టీ కౌన్సిలర్లను గెలుచుకున్న కాంగ్రెస్.. రెండు వర్గాలుగా విడిపోయింది. పదవుల పంపకంపై ఇరుపక్షాలు బెట్టు దిగకపోవడంతో రాజకీయం రసవత్తరంగా మారింది. ఇదే సీను ఇబ్రహీంపట్నం పురపాలికలోనూ కనిపిస్తోంది. గులాబీ శిబిరంలో కీచులాటలతో చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు ఏకంగా కలెక్టర్‌కే ఫిర్యాదు చేశారు. అవినీతి ఆరోపణలు సంధిస్తూ ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరారు. తాజాగా మూడేళ్ల కాలపరిమితి ముగియడంతో ఇదే అదనుగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టే అంశంపై మంతనాలు సాగిస్తున్నారు.
- మరోవైపు ఆదిబట్ల మున్సిపాలిటీలో టీఆర్ఎస్‌లో చేరి చైర్‌పర్సన్ పదవిని కాంగ్రెస్ కౌన్సిలర్ దక్కించుకున్నారు. అనంతరం జరిగిన పరిణామాలతో స్థానిక ఎమ్మెల్యేలతో చైర్‌పర్సన్‌కు పొసగడం లేదు. దీంతో ఆమెను గద్దె దింపే దిశగా ఎమ్మెల్యే వర్గీయులు చక్రం తిప్పుతున్నారు. నార్సింగి, మణికొండ మున్సిపాలిటీలు.. బండ్లగూడ నగర పాలక సంస్థలోనూ చైర్మన్‌గిరీ విషయంలో మడతపేచీ నెలకొంది. ఇక్కడ కూడా రెండున్నరేళ్ల చొప్పున పదవిని పంచుకోవాలనే ఒప్పందానికి వచ్చారు. తాజా పరిణామాలతో పోస్టు నుంచి తప్పుకొనేందుకు నో చెబుతుండడంతో రాజకీయం ఉత్కంఠగా మారింది.

క్రమబద్ధీకరణలో నిర్లక్ష్యం తగదు

- బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి

హుడాకాంప్లెక్స్: 58, 59 జీవో నంబర్ ప్రకారం క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి డిమాండ్ చేశారు. సరూర్‌నగర్ మండల కార్యాలయం ఎదుట సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న వారికి ఆ భూములపై హక్కులు కల్పించేందుకు 58, 59 జీవోల ద్వారా 2015లో అవకాశం కల్పించారని, ఆ సమయంలో అర్హులకు పట్టాలు కూడా అందజేసిందన్నారు. 2014 జూన్ 2 కంటే ముందు నుంచి నివాసముంటున్న విద్యుత్ బిల్లు ఇతర ఏదైనా రుజువు చూపించిన వారి నివాస స్థలాలను క్రమబద్ధీకరణ చేసి, 2014 తర్వాత నుంచి నివాసముంటున్న వారిని అనర్హులుగా తిరస్కరించారని గుర్తు చేశారు. మొదటి విడతలో 58 జీవో ద్వారా ఉచితంగా, 59 జీవో ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు క్రమబద్ధీకరించారని, ఈ విధంగా 2015లో తిరస్కరణకు గురైన వారిని అనర్హులుగా ప్రభుత్వం చెప్పకనే చెప్పిందన్నారు. 2022లో మరోసారి క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ 58, 59 జీవోలకు కొనసాగింపుగా జీవో నంబర్ 14ను జారీ చేసిందన్నారు. ఈసారి కూడా 2014 జూన్ 2 కంటే ముందు ఆక్రమణలో ఉన్న వారి స్థలాలను మాత్రమే క్రమబద్ధీకరించనున్నట్లు పేర్కొందన్నారు. మొదటి విడతలో దరఖాస్తు చేసుకోని వారితో పాటు అప్పుడు తిరస్కరణకు గురైన వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ అస్పష్ట విధానాలతో ప్రజలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. రెండో విడతలో 58 జీవో ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి నెలలు గడుస్తున్నా నేటికీ పట్టాలు అందజేయకుండా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. 59 జీవో ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి రూ.లక్షల్లో చెల్లించాలని నోటీసులు పంపించడం జరిగిందని, రూ.లక్ష లేదా 2 లక్షల్లో క్రమబద్ధీకరిస్తారని భావించి దరఖాస్తు చేసుకుంటే ఇప్పుడు రూ.18 లక్షలు, రూ.20 లక్షలు చెల్లించాలని నోటీసులు పంపడంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. అనంతరం తహసీల్దార్ జయశ్రీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ అసెంబ్లీ కన్వీనర్ కొత్త రవీందర్‌గౌడ్, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, చింతల సురేందర్, పవన్‌కుమార్, ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి, లచ్చిరెడ్డి, బండారి భాస్కర్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి..

యువకుడి మృతి


రాజేష్ (ఫైల్)

షహాబాద్: బైక్ అదుపు తప్పి యువకుడు మృతి చెందిన సంఘటన షహాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండలానికి చెందిన మిడిగొల్ల రాములు కుమారుడు రాజేశ్(20) రావిర్యాలలో నివాసం ఉంటూ జేసీబీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తన స్నేహితుడు చందూతో కలిసి రావిర్యాల నుంచి తుక్కుగూడకు ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు మీదుగా బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పడంతో తీవ్రగాయాలైన రాజేశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతని స్నేహితుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గూడు కోసం గుడిసెలు

గూడు కోసం పేదలు పోరాటబాట పట్టారు. ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో ప్రారంభించిన పోరాటం సోమవారం కొనసాగింది. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించినా వేల సంఖ్యలో వచ్చిన పేదలు ఎర్రజెండా నీడన గుడిసెలు వేసుకున్నారు.

- రోడ్లను దిగ్బంధించిన పోలీసులు
- భూమి తమదంటున్న గడ్డం బాబయ్య వారసులు


గుడిసెలు వేసుకుంటున్న పేదలు

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలంలోని కుంట్లూర్ (పాపయ్యగూడ)లోని వివాదాస్పద భూమిలో గుడిసెల ఏర్పాటు ప్రక్రియ రెండో రోజు సోమవారం కొనసాగింది. సర్వేనెంబర్ 214 నుంచి 224 వరకు ఉన్న సర్వే నెంబర్లలోని సుమారు వంద ఎకరాల భూమిలో ఆదివారం నుంచి సీపీఐ ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఈ స్థలాన్ని ఖాళీ చేయించాలని రెవెన్యూ, పోలీసు సిబ్బంది ప్రయత్నించినా సాధ్యం కాలేదు. సోమవారం వేల సంఖ్యలో పేదలు గుడిసెలు వేసేందుకు వచ్చారు. రోడ్లను దిగ్బంధించి పోలీసులు వారిని అడ్డుకునేందు ప్రయత్నించారు. ప్రజలు వేల సంఖ్యలో రావడంతో వారిని ఆపేందుకు పోలీసులకు సాధ్యమవ్వలేదు. ఓ వైపు పోలీసులు అడ్డుకుంటున్నా మరో వైపు నుంచి భూమిలోకి వచ్చి అవకాశం ఉన్న చోట గుడిసెలు వేసుకుంటున్నారు. సోమవారం చీకటి పడే వరకు ఉద్రిక్తత కొనసాగింది.

ప్రభుత్వం ఓఆర్‌సీ ఇచ్చింది: గడ్డం బాబయ్య వారసులు

ఇది ఇలా ఉండగా కుంట్లూర్ 210–213, 221–224లలోని సుమారు 68 ఎకరాల భూమి తమకు చెందుతుందని ఈ భూమికి తామే వారసులమని హయత్‌నగర్‌కు చెందిన గడ్డం బాబయ్య వారసులు వాపోతున్నారు. సీపీఐ నాయకులు భూదాన భూమిగా ప్రచారం చేస్తూ పేదలను మభ్యపెట్టడం సరికాదన్నారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వాకిటి పుల్లారెడ్డి అనే భూమి వద్ద మా తాత గడ్డం బాబయ్య కౌలు చేయడంతో కౌలు కింద 68ఎకరాల భూమి సంక్రమించిందని ప్రభుత్వం ఓఆర్‌సీ ఇచ్చిందని, పాత పాస్‌పుస్తకాలు న్నాయన్నారు. దీనిపై పుల్లారెడ్డి వారసులమని కుంట్లూర్‌కు చెందిన కొందరు కోర్టుకు వెళ్లడంతో కోర్టులో కేసు కొనసాగుతోందన్నారు. కాగా ఈ భూమికి భూదాన బోర్డుకు ఎలాంటి సంబంధం లేదని, భూదాన భూమి అంటూ పలు మార్లు గుడిసెలు వేసేందుకు ప్రయత్నాలు జరిగాయన్నారు. ప్రజలు మోసపోవద్దని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డం సాయిలు, సోమయ్య, దుర్గయ్య, మల్లేశ్, కృష్ణ తదిరులు పాల్గొన్నారు.

ఓ మనిషీ.. తిరిగి చూడు!

అద్దం పట్టిన జియాగూడ హత్యోదంతం

- ఘోరాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరించిన జనం
- కళ్లెదుటే దారుణంపై స్పందించని వైనం
- ఈ పరిస్థితికి అనేక కారణాలున్నాయన్న ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం ప్రొఫెసర్ అనిత

వ్యసనంగా మారిన 'వీడియోల వైరల్ కిక్'



సాక్షి, సిటీబ్యూరో: 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు.. మచ్చుకై నా లేడు చూడు మానవత్వం ఉన్నవాడు' అంటూ ప్రముఖ కవి, వాగ్గేయకారుడు అందెశ్రీ రాసిన గీతం సమాజంలో నానాటికీ అడుగంటుతున్న మానవవతా విలువలకు అద్దం పడుతోంది. ఆదివారం జియాగూడలో జరిగిన దారుణ ఉదంతాన్ని కళ్లకు కడుతోంది. పురానాపూల్ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న అంబర్‌పేట వాసి జంగం సాయినాథ్‌ను అడ్డగించిన ముగ్గురు దుండగులు దారుణంగా హత్య చేశారు. పట్టపగలు, నడిరోడ్డుపై నరికి చంపుతున్నా స్థానికులు చూస్తూ ఊర్కుకున్నారే తప్ప అడ్డుకోవడానికి ముందుకు రాలేదు. జరుగుతున్న ఘోరాన్ని అనేక మంది వీడియో చిత్రీకరించి వైరల్ చేశారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఉదంతాలు అనేక చోటు చేసుకున్నాయి. మనుషుల్లో పెరిగిపోతున్న ఈ ధోరణికి కారణాలపై ఎర్రగడ్డ మానసిక చికిత్సాలయం ప్రొఫెసర్ డాక్టర్ అనిత రాయిరాలను 'సాక్షి' అభిప్రాయం కోరగా.. సమాజంలో ఈ పరిస్థితులు తలెత్తడానికి అనేక కారణాలు ఉన్నాయని ఆమె అన్నారు. తాజా పరిస్థితులపై డాక్టర్ అనిత తన అభిప్రాయాన్ని ఇలా వెలిబుచ్చారు.

సెన్సేషనలిజాన్ని ఆస్వాదించడానికే...

- కళ్లెదుటే జరుగుతున్న ఘోరాన్ని ఆపడానికి బదులు దాన్ని తమ సెల్‌ఫోన్లలో చిత్రీకరించే ధోరణి పెరిగిపోయింది. ఆ వీడియో వైరల్ కావడం వల్ల వచ్చే కిక్, ఆ సెన్సేషనలిజాన్ని ఆస్వాదించడానికి కొందరు ఇలా చిత్రీకరిస్తున్నారు. ఈ వీడియోలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తూ లైక్స్, కామెంట్స్, ఫార్వర్డ్స్‌లో తమ సక్సెస్ వెతుక్కునే వాళ్లు పెరిగిపోయారు. స్మార్ట్ ఫోన్ సామాన్యుడి చేతికి రావడంతో ఈ మీడియా పరిధి పెరిగిపోవడం, ఇందులోని అంశాలు వేగంగా విస్తరించడం తదితర కారణాలతో తమ వీడియో వైరల్ కావడం ఓ కిక్‌గా భావిస్తున్నారు. కొన్నింటిని వైరల్ చేస్తూ అందులో ఆనందాన్ని వెతుక్కుంటున్నారు.
- సోషల్‌మీడియాలో ట్రోలర్స్ ఎవరనేది ఎదుటి వారికి తెలీదు. దీంతో వాళ్లు చేసే కామెంట్స్, పోస్టులు నేరుగా వీళ్లపై ప్రభావం చూపదు. ఈ కారణంగానూ ఘోరాలను వీడియో తీసి వైరల్ చేయడం అనే ధోరణి పెరిగిపోయింది. ప్రస్తుత విద్యా వ్యవస్థ మార్కులు, ర్యాంకుల ఆధారితంగా మారిపోయింది. ఈ పరిస్థితులు మారాలంటే కుటుంబ వ్యవస్థ బలంగా ఉండాలి. తల్లిదండ్రులు, చదువు చెప్పే గురువులు ఆ కోణంలో కృషి చేయాల్సిన అవసరం ఉంది. సామాజిక బాధ్యతలు, విలువలు విద్యలో భాగంగా మారాలి. ప్రతి వ్యక్తి జీవితంలో రోల్ మోడల్స్‌ను ఎంచుకునే విధానం మారాలి. అలా ప్రతి ఒక్కరూ కృషి చేస్తేనే ఫలితాలు ఉంటాయి.

హీరోయిజానికి అర్థం మారిపోయింది..

- ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాలు, వాటి విలువలు తగ్గాయి. మనుషులను బట్టే సమాజం కూడా ఉంటుంది. అనేక మంది ఇళ్లల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి ఒక్కరిలో స్వార్థం పెరిగిపోవడంతో ఎదుటి వారికి సహాయం చేస్తే నాకేంటి లాభం అని ఆలోచిస్తున్నారు. గతంలో వీరికి సహాయం అవసరమైనప్పుడు ఎవరూ ముందుకు రాకపోవడమూ ఈ ధోరణికి ఓ కారణమే.
- సినిమాలు, మీడియా తదితరాలను కూడా సక్సెస్ అంటే ఉన్నత స్థితికి చేరడం, డబ్బు సంపాదించడం అంటూ.. హీరోయిజమంటే ఎదుటి వారిని కొట్టడం అన్నట్లు చూపిస్తున్నాయి. ఇలాంటి వారికి లభిస్తున్న ప్రచారం పది మందికి సహాయపడిన, పడుతున్న వారికి లభించట్లేదు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతినడం కూడా మానవ సంబంధాలు, అనుబంధాలు, ఆప్యాయతలు తగ్గిపోవడానికి కారణమైంది. వీటితో పాటు సమాజంలో నిత్యం జరుగుతున్న నేరాలు చూడటం అలవాటు పడిన వాళ్లు తమ కళ్ల ముందే ఘోరం జరుగుతున్నా స్పందించట్లేదు.



కుమారుడి మరణాన్ని తట్టుకోలేక..

ఉరి వేసుకుని తల్లి ఆత్మహత్య


కలమ్మ మృతదేహం

మైలార్‌దేవ్‌పల్లి: కుమారుడి మరణాన్ని జీర్ణించుకోలేని ఓ తల్లి మనస్తాపంలో ఆత్మహత్య చేసుకున్న సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నయీం కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కొత్త కలమ్మ(39), సత్తయ్య దంపతులు మైలార్‌దేవ్‌పల్లి రాజీవ్‌గృహకల్పలో నివాసం ఉంటున్నారు. వీరి కుమారుడు లక్ష్మణ్ గత సంవత్సరం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పటినుంచి మనోవేదనకు లోనైన కలమ్మ సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకోని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పదోన్నతులు కల్పించడం హర్షణీయం



కడ్తాల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టడం హర్షణీయమని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కనకయ్యగారి గోవర్ధన్‌యాదవ్ అన్నారు. పీఆర్టీయూ టీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డికి మద్దతుగా ఆయన సోమవారం మండల పరిధిలోని కడ్తాల్, మక్తమాధారం, రావిచేడ్, ఎక్వాయిపల్లి, ముద్వీన్, చరికొండ, ఆకుతోటపల్లి పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మండల పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు రాధాకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి పద్మావతితో కలిసి ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం ఉద్యమించే పీఆర్టీయూ టీఎస్ అభ్యర్థి చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు ఇప్పించిన తర్వాత ఓటు అడుగుతామని మాట నిలబెట్టుకున్న ఘనత పీఆర్టీయూ టీఎస్ సొంతమన్నారు. ఉపాధ్యాయులకు పదోన్నతులు, హెల్త్ కార్డు లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు పీహెచ్‌ఎస్‌ఎం పదోన్నతులు ఇప్పించేలా పీఆర్టీయూ టీఎస్ కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరోత్తంరెడ్డి, శ్రీనివాస్‌చారి, కిషోర్, సుగుణ, రోహిణి, లతా, మునీర్, తిరుపతి రెడ్డి, వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రవీణ్‌రెడ్డి, ధనంజయ్‌గౌడ్ లత, శైలజ, కల్యాణి, భాస్కర్‌రావు సలోమిని, రాజ కుమారి, వెంకట్‌రెడ్డి, సుదర్శన్, రమేశ్, బళ్లారి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, ప్రవీణ్, వెంకట్ పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

భాగ్యనగర్‌కాలనీ: గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అరెస్టు చేయగా ఇద్దరు పరారైన సంఘటన కూకట్‌పల్లి పీఎస్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. సీఐ నర్సింగరావు కథనం ప్రకారం ఇంద్రారెడ్డినగర్, కొల్లూరులో ఉంటున్న నూక దీపక్ క్యాటరింగ్ పనిచేస్తున్నాడు. ప్రకాష్‌నగర్‌కు చెందిన నరేష్ ఆఫీస్ బాయ్‌గా పని చేస్తుండగా, బోయ మల్లేశ్ కూలీ పని చేస్తున్నాడు. వీరి ముగ్గురితో పాటు జగద్గిరిగుట్టకు చెందిన అజయ్, సాయిలు ఏజెన్సీ ప్రాంతానికి చెందిన వ్యక్తి నుంచి 5 కిలోల గంజాయి కొనుగోలు చేసి నగరానికి తీసుకువచ్చారు. సికింద్రాబాద్ నుంచి బస్సులో కూకట్‌పల్లి బస్‌స్టాప్‌కు చేరుకున్నారు. వీరి వద్ద ఉన్న ప్లాస్టిక్ బ్యాగు అనుమానాస్పదంగా కనిపించటంతో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారయ్యారు. నిందితుల నుంచి 5 కేజీల గంజాయి, మూడు ఫోన్లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

కల్లుకు వచ్చి పుస్తెలతాడు చోరీ

ఇబ్రహీంపట్నం రూరల్: కల్లు తాగేందుకు వచ్చి కల్లు అమ్ముతున్న మహిళా మెడలోంచి పుస్తెలతాడు లాక్కెళ్లిన సంఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఆదిబట్ల ఎస్ఐ లక్ష్మీనారాయణ కథనం ప్రకారం.. ఆదిబట్ల గ్రామానికి చెందిన దుబ్బాక అనిత ఆదిబట్ల టౌన్‌కు సమీపంలోని బ్రిడ్జి వద్ద కల్లు అమ్ముతుంటుంది. సోమవారం సాయంత్రం ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి కల్లు అడిగారు. ఒకరు కల్లు తాగుతుండగా మరో ఇద్దరు ఖాళీగా కూర్చున్నారు. గంటపాటు అక్కడే ఉండి ముగ్గురిలో ఒకరిని బైక్‌పై తీసుకెళ్లి విడిచిపెట్టి వచ్చారు. ఇద్దరు తిరిగి వచ్చి మరో మారు కల్లు అడిగారు. అనిత కల్లు వంపుతుండగా మెడలో ఉన్న ముడున్నర తులాల పుస్తెలతాడును తెంపుకుని బైక్‌పై ఓఆర్‌ఆర్ వైపు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ నాయకులపై కేసు

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం కుంట్లూర్‌లోని వివాదాస్పద భూమిలో గుడిసెలు వేయించేందుకు ప్రోత్సహించారనే కారణంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ నాయకులు పల్లా వెంకట్‌రెడ్డి, నాయకులు రవీంద్రాచారి, శేఖర్‌రెడ్డితో పాటు మరో 20మందిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. సుమారు రెండు వేల మంది అక్రమంగా గుడిసెలు వేశారని ఆయన తెలిపారు. వారిపై 447, 427, 353, 120బి, 147, 148, 149 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కోహెడ మార్కెట్ భూమిని యాజమాన్య పద్ధతిలో కేటాయించండి

ప్రభుత్వానికి కమీషన్ ఏజెంట్ల విజ్ఞప్తి

సాక్షి, సిటీబ్యూరో: వనపర్తి మార్కెట్ తరహాలోనే బాటసింగారం మార్కెట్ కమీషన్ ఏజెంట్లకు యాజమాన్య పద్ధతిలో కోహెడ మార్కెట్ భూమిని కేటాయించాలని ది హోల్‌సేల్ ఫ్రూట్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తాజొద్దీన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం ×సాక్షి×తో ఆయన మాట్లాడుతూ... బాటసింగారం పండ్ల మార్కెట్ కమీషన్ ఏజెంట్లు కోహెడలో భూమి కేటాయించాలని కోరుతున్న విషయం కొత్తేమీ కాదన్నారు. గ్రేటర్ పరిధిలోని బోయిన్‌పల్లి మార్కెట్, గుడిమల్కాపూర్ పూల మార్కెట్‌లు ఏర్పాటుకు ముందు మార్కెటింగ్ శాఖ అక్కడి కమీషన్ ఏజెంట్లుకు వ్యాపారం చేసుకోవడానికి మార్కెట్ భూమిని యాజమాన్య పద్ధతిలో కేటాయించిందని గుర్తు చేశారు. కొత్తపేట మార్కెట్ స్థలం సరిపోవడం లేదని పదేళ్ల క్రితం కోహెడలో పండ్ల మార్కెట్ కోసం 178 ఏకరాల భూమి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ పేరుతో మార్కెటింగ్ శాఖ కొనుగోలు చేసింది. ఈ భూమి కొనుగోలులో ఎక్కువ వాటా కొత్తపేట పండ్ల మార్కెట్‌ది ఉందన్నారు. కొత్తపేట మార్కెట్‌తో ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని కోహెడలో తాత్కాలిక షెడ్లు నిర్మించి మార్కెట్‌ను తరలించారు. గతేడాది మార్కెట్ స్థలంలో ఆస్పత్రి నిర్మించడానికి ప్రభుత్వం నిర్ణయిందన్నారు. అదే సమయంలో వనపర్తి మార్కెట్‌లా పండ్ల మార్కెట్ కమీషన్ ఏజెంట్లకు కూడా భూమి కేటాయించాలని ప్రభుత్వనికి లేఖ కూడా రాసినట్లు చెప్పారు. కోహెడలో భూమి యాజమాన్య పద్ధతిలో కేటాయింపు విషయం తమ సంఘం ఒక్కటే చెప్పడం లేదని ఇతర కమీషన్ ఏజెంట్ల సంఘాలు కూడా ప్రభుత్వాని విజ్ఞప్తి చేస్తున్నాయని చెప్పారు. ఇప్పటికైనా కమీషన్ ఏజెంట్లకు ప్రభుత్వం కోహెడలో యాజమాన్య పద్ధతిలో భూమి కేటాయించాలని కమీషన్ ఏజెంట్లు విజ్ఞప్తి చేస్తున్నారు.

అక్రమ కట్టడాలపై చర్యలేవి..?

- ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో అక్రమ నిర్మాణాలు
- ప్రజాప్రతినిధుల అండ ఉందంటూ ఆరోపణలు
- చర్యలు తీసుకోవాలని ప్రజల విజ్ఞప్తి


సొసైటీ బోర్డుపై అంటించిన పోస్టర్లు


ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో అక్రమంగా నిర్మిస్తున్న గోదాంలు

మైలార్‌దేవ్‌పల్లి: ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో పెద్ద ఎత్తున అక్రమ గోదాంలు వెలుస్తున్నాయి. ప్రజాప్రతినిధుల అండతో బేగంబజార్ వ్యాపారులు సొసైటీలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మాజీ పార్లమెంట్ సభ్యుడు వి.తులసీరామ్ గగన్‌పహాడ్‌లో స్థానికుల అవసరాల మేరకు సొసైటీలో ఏర్పాటు చేశారు. అయితే ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరికి వారు ఇష్టానుసారంగా కొనుగోలు చేసిన స్థలాల్లో వందలాది అక్రమ గోదాంలు వెలుస్తున్నాయి. స్థానికులతో ఒప్పందాలు కుదుర్చుకున్న బేగంబజార్ వ్యాపారులు కాంట్రాక్టు పద్ధతిలో గోదాంలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. సొసైటీలో ఏర్పాటు చేసిన బోర్డుపై గిడ్డంగులు అద్దెకు ఇస్తామంటూ పోస్టర్లు అంటించడం చర్చనీయాంశంగా మారింది. అక్రమ నిర్మాణాలపై రాజేంద్రనగర్ టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. 2022 సంవత్సరంలో గోదాంల పరిసర ప్రాంతాల్లో చెత్తను సేకరించే ఓ మహిళ కెమికల్ బాంబు పేలి అక్కడికక్కడే మృతిచెందింది. నిర్మానుష్య ప్రాంతంగా ఉండే ఇందిరా గాంధీ హౌసింగ్ సొసైటీలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: రైలు ఢీకొని గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన కేశంపేట రైల్వేగేటు సమీపంలో సోమవారం వెలుగు చూసింది. వివరాలు.. పట్టణంలోని కేశంపేట రైల్వే గేటు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు సోమవారం రైల్వే పోలీసులకు సమాచారం అందింది. వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే 94414 07039 నెంబర్‌కు సమాచారం అందించాలని రైల్వే పోలీస్ శ్రీనివాస్ కోరారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతి

తుక్కుగూడ: గుండెపోటుతో పారిశుద్ధ్య కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో సోమవారం చోటు చేసుకుంది. రావిర్యాలకు చెందిన నాగేశ్ (52) తుక్కుగూడ మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి వస్తుండగా మహేశ్వరం గేటువద్ద గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహానికి కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది నివాళి అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం నాగేశ్ కుటుంబ సభ్యులకు.. మున్సిపల్ కమిషనర్ వెంకట్రామ్ రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.